# గాయత్రీ మహావిద్య

Lecture given at New jersey youth camp , USA , on Aug-1st-2008

వ్యాఖ్య : డా॥ శ్రీరామకృష్ణ, Msc. Ph.D.

అనువాదము మరియు అక్షరకూర్పు : శ్రీమతి లక్ష్మీరాజగోపాల్, ఒంగోలు

# గాయత్రీ విద్య

రాబోయే 10 లేక 12 సంవత్సరములలో ఈ ప్రపంచమున గాయత్రీమహావిద్య మాత్రమే చెలామణిలో వుంటుంది, రక్షించబడి వుంటుంది. అప్పుడు మిగతా అన్ని విద్యలూ గాయత్రీమహావిద్యయొక్క అంగాంగములుగా మాత్రమే వుంటాయి. రసాయనశాస్త్రము, భౌతికరసాయన శాస్త్రము, విద్యుశ్ఛక్తి మొదలగు ఏ విద్య లైనా ఇప్పటివరకు ఉన్నవి, ఉంటున్నవి, ఉండబోయేవి ఇవన్నీకూడా రాబోయే రోజులలో గాయత్రీ మహా విజ్ఞానము యొక్క అంగప్రత్యంగములుగా రూపుదాలుస్తాయి. అదెలా జరుగుతుంది? ఎలా సంభవ మౌతుంది? అనేది పూజ్యగురుదేవులు తెలిపారు. అది మానవజాతికి గురుదేవు లిచ్చిన అనేక వరములలో ఒక వరము. గురుదేవులు ప్రపంచమునకు కేవలము గాయత్రీ మంత్రమే కాదు, చాలా మంత్రములను అందించారు. అయితే వాటిలో గాయత్రీమంత్రము చాలా ముఖ్యము. గాయత్రీమంత్రము లేక దాని విజ్ఞానం గురించి తెలుసుకోవా

లనుకుంటే; ముందుగా కొన్ని ప్రత్యేక శబ్దముల యొక్క విశేష అర్థమును తెలుసుకోవాల్సివుంటుంది. ఆ పదములే సంస్కృతి మరియు సభ్యత. ఇవి మనము తెలుసుకోవాల్సిన రెండు ముఖ్య పదములు. ముందుగా మనము సంస్కృతిని గురించి తెలుసుకుందాము.

సంస్కృతిని, దాన్ని బోధించే రెండు మహావిశ్వవిద్యాలయముల గురించి, అందులో బోధించే విషయముల గురించి కూడ తెలుసుకుందాము. అలాగే గాయత్రీమంత్రముచే సమస్త ప్రపంచము ఎలా సృష్టించబడినదో తెలుసుకోవడము అత్యంత ఆవశ్యకము. ముందుగా సంస్కృతి మరియు సభ్యత మధ్యగల భేదమును అర్థము చేసుకోండి. సంస్కృతి అంటే కల్చర్ అనగా సంస్కరించబడటము.

సభ్యత అంటే సివిలైజేషన్, నాగరికత.

సంస్కృతి నాయకుల ద్వారా అభివృద్ధి చెందినది. వారు ఏ సంస్కృతినైతే అభివృద్ధి చేశారో, అలాంటి దాన్ని ప్రజలు ఆచరణలో పెడతారు, దాన్ని సభ్యత అంటాం. ఈ రెండిటి మధ్య తేడా చాలా స్పష్టంగా గుర్తుంచుకోవాలి. సంస్కృతి అనేది మానవజాతి ముందు ఒకానొక లక్ష్యముగా పెట్టబడుతుంది. ఇది అభ్యాసంద్వారా, ఆచరణ ద్వారా అమలుచేయ చేయబడుతుంది. దీన్ని

అభ్యసించినవారు బహులాభాన్వితు లౌతారు. కనుక సంస్కృతి అనేది ప్రజల నిత్యనైమిత్తిక జీవితమునకు నాయకత్వము వహిస్తుంది. ప్రజలు దీన్ని ఆచరణలో పెట్టడం ఆరంభిస్తే; మెల్లిమెల్లిగా అది నాగరికతగా అభివృద్ధి చెందుతుంది.

సంస్కృతి - సభ్యతకు జనని. సంస్కృతిలోంచి సభ్యత వుత్పన్నమౌతుంది. సంస్కృతి - నాయకుడు. సభ్యత - అనుయాయి. ఎక్కువమంది అనుసరించేది సభ్యత. వారికి మార్గదర్శనము చేసేవారు సంస్కృతిగలప్రజ. అందుచేత సంస్కృతి - సభ్యతకు మార్గదర్శనము చేస్తుంది.

**యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః ।**

**స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥ (గీత అ॥3, శ్లో॥ 21)**

**తాత్పర్యము :- ఎందుకనగ ఉత్తముడగు పురుషుడు ఏ యే ఆచరణ గావించునో అన్య పురుషులుకూడ అదేవిధముగ నాచరణ చేయుదురు. అతడు దేనిని ప్రమాణముగ చేయునో దానిప్రకారమే సకల మానవసముదాయము చేయునారంభించును.**

సామాన్యులు అనుసరించేది సభ్యత.

సంస్కృతి తెలివైనవారి సొత్తు, సమాజమునకు మార్గదర్శనము చేయువారి సొత్తు. వారు యేమి చేస్తే సమాజము వారిని అనుసరించి అదే చేస్తుంది. నాయకులు యేది చేస్తే అదే సరైనది. ఆధ్యాత్మికవేత్తలు లేక శ్రేష్ఠులు ఆచరణ చేసేది సంస్కృతి.

శిక్షణ యెలా వుండాలంటే ప్రాచీనకాలములో చెప్పిన మంచి విషయములను మనము మర్చిపోకూడదు. వర్తమానములో వుపయోగపడేదిగ వుండాలి. భవిష్యత్తుకి దోహదకారి అవ్వాలి. అంటే భూతభవిష్యవర్తమానములు మూడింటికి వుపయోగపడాలి. ఇలాంటిది యేదైన ప్రపంచములో వున్నదా? అలాంటిది వున్నది. అదే గాయత్రీమంత్రము.

**కనుక యెప్పుడైన యే దేశములోనైనా సంస్కృతి అభివృద్ధి చెందాలంటే అది గాయత్రిమంత్రమునే ఆలంబనగ తీసుకోవాలి. మన మస్తిష్కము అనే తంత్రములో దాన్ని నిక్షిప్తము చేసుకోవాలి. మన ఋషులు అందించిన అత్యద్భుత వరము అది. ఇంక దాన్ని మించినది యేది లేదు. దాన్ని మీరు అధిగమించలేరు. ఇష్టమైతే దాన్ని వుపయోగించుకుంటారు లేకపోతే మానేస్తారు, అంతే!**

## *1. తత్సవితుర్వరేణ్యం - భూతకాలము*

ఆ సవితాశక్తి లేక సూర్యుడు గతములో యెలా పనిచేస్తూ చేస్తూ వచ్చాడో మన జీవితవిధానముకూడ అలానే సూర్యునకు అనుగుణ్యముగ వుండాలి. అంటే మన జీవితవిధానము దేనికి అనుకూలముగ వుండాలి? సూర్యుడికి అనుగుణ్యముగ వుండాలి. నీరు, సూర్యుడు లేకపోతే జీవము లేదు. గతము యేమిటి? సూర్యుడు.

**ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్ ।**
**వివస్వాన్మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽబ్రవీత్ ॥ (గీత అ॥4, శ్లో॥1)**

**తాత్పర్యము : శ్రీభగవానుడిట్లనెను - అవినాశియగు యీ యోగమును నేను సూర్యునకు చెప్పితిని. సూర్యుడు తన కుమారుడైన వైవస్వత మనువునకు బోధింపగ; ఆ మనువు తన తనయుడగు ఇక్ష్వాకు చక్రవర్తికి చెప్పియుండెను.**

## *2. భర్గోదేవస్యధీమహి - వర్తమానము*

సూర్యుడు సమస్త ప్రపంచమునకు వెలుతురునిస్తున్నాడుగ!! ఆ వెలుతురు మనిషి అన్ని కార్యక్రమాలకు సహకరిస్తోంది. మనంకూడ అలాగే ఇతరులకి సహాయం చేయాలి.

## 3. ధియో యో నః ప్రచోదయాత్ - భవిష్యత్కాలము

మా బుద్ధి సన్మార్గమువైపు నీ ద్వారా ప్రేరేపితమగుగాక!!

కనుక విద్యకు కావల్సిన మొత్తము విజ్ఞానము, జ్ఞానమునకు కావల్సిన విద్య గాయత్రీమంత్రములో వున్నది. సమస్తవిద్యలు యీ గాయత్రిలోనే వున్నాయి. కావున గాయత్రిమంత్రము సంస్కృతికి ప్రతిబింబము. సంస్కృతి రాబోయే సభ్యతకు మార్గదర్శనము వహిస్తుంది.

గాయత్రీ మహామంత్రములో ఏ సంస్కృతులైతే వున్నాయో అవన్నీ యుగానుసారం తమదైనరీతిలో ప్రజల ముందుకొస్తాయి. ఉదా॥ ఫారడే విద్యుశ్ఛక్తిని కనుగొన్నప్పుడు, దాన్ని ఒక మంత్రం(సూత్రం) లాగ, ఒక శస్త్రం లాగ అందించాడు. అంటే ఆయన ఒక సూత్రము ద్వారా శక్తిని ఎలా వుపయోగించుకోవాలో, శక్తిరూపముగా అందించాడు అని మనము భావించవచ్చు. అయితే తర్వాత వచ్చిన ఎడిసన్ అనే శాస్త్రవేత్త వచ్చి దాన్ని వుపయోగంలో పెట్టినప్పుడు, అది పేటెంట్ హక్కును పొందినది.

'ఫారడే - ఓమ్సలా' అనేవి విద్యుత్తు అనే సంస్కృతి - భవంతిని నిర్మించినవి. ఎడిసన్ మొదలగువారు కనుగొన్నవి నాగరికత అనే భవంతిని నిర్మించాయి. సంస్కృతి-సభ్యత మధ్య గల అంతరం స్పష్టంగా తెలియనంత

వరకు మనిషి విజ్ఞానమును అర్థము చేసుకోలేడు. విజ్ఞానంలో - థియరీ మరియు ప్రాక్టికల్స్ అనే రెండు విషయములు వుంటాయి. థియరీ అనేది విస్తృతమైనది. అయితే థియరీలో చెప్పిన సూత్రములను ఆచరణలో పెట్టినప్పుడు చాలాసార్లు మనము ఫలితమును పొందలేమేమో!!

ఉదా॥ క్యాన్సర్, డయాబెటిస్, రక్తపోటు. ఈనాడు ఈ 3 ప్రజలను పట్టిపీడిస్తున్న నయం కాని వ్యాధులు. వాటి నివారణ దాదాపు అసాధ్యము అని చెప్పవచ్చు. కానీ ఎప్పుడైతే గాయత్రీమహామంత్రమును అర్థము చేసుకుంటామో అప్పుడు ఈ 3 వ్యాధుల తక్షణ నివారణ జరుగుతుంది.

ఈనాడు శక్తియొక్క దురుపయోగము చాలా జరుగుతున్నది. దానితో డయాబెటిస్ అనే వ్యాధి సంక్రమిస్తున్నది. దాన్నే పరమపూజ్యగురుదేవులు శ్రద్ధారాహిత్యము అన్నారు. మనము 'మాకు శ్రద్ధ వున్నది అని డంభాలు పలికినప్పటికి, ఆచరణాత్మకంగా విఫలురమౌతున్నాము.' ఉదా॥ ప్రతి విద్యార్థి మొదటిశ్రేణిలో ఉత్తీర్ణుడవ్వాలని కోరుకుంటాడు. అయితే నిమ్నస్థాయిలో వున్న విద్యార్థి మొదటిశ్రేణిలో ఉత్తీర్ణుడవ్వడము మనమింతవరకు చూడలేదు. మొదటిశ్రేణిని ప్రతీ విద్యార్థి పొందే సంభావన ఉన్నది. కదా!! అయినా యావద్భారతంలో గనుక గమనిస్తే మొదటిశ్రేణిలో ఉత్తీర్ణులయ్యేవారి శాతము

బహుతక్కువ. విద్యార్థులందరూ మొదటితరగతిలో ఉత్తీర్ణులవ్వాలని కోరుకున్నప్పటికి ఎంతమంది లక్ష్యమును సాధిస్తున్నారు?

మనము కోరుకున్నది ఆచరణలోకి వచ్చినప్పుడు అది శ్రద్ధారూపు దాల్చింది అని చెప్పవచ్చు. ఇది శ్రద్ధయొక్క పరిభాష. కోరిక - ఆచరణలోకి వచ్చుట = శ్రద్ధ. మనము నాకు ఫలానా విషయం మీద శ్రద్ధ వున్నది అని చెప్పి, దాన్ని క్రియారూపంలో పెట్టనప్పుడు శ్రద్ధ లేదు అని స్పష్టమౌతున్నది. ఆ సంఘటన వాస్తవరూపంలో జరుగుతున్నప్పుడు, తాను ఏమి చెప్పాడో దాన్ని మర్చిపోతాడు. అతడు తనకు దేనిమీదైతే శ్రద్ధ వున్నదని చెప్పాడో దాన్నే మర్చిపోయాడు. అంటే శ్రద్ధ లేదనేగా అర్థము.

దీన్నే మన శాస్త్రములు 'ఆహారనిద్రాభయమైథునఞ్చ సామాన్యమేతత్ పశుభిర్నరాణామ్' అని ఘోషిస్తున్నాయి. ధర్మము -అనేది మానవులను పశువుల నుండి వేరుచేసి చూపిస్తుంది. ఆంగ్లములో కూడ Man is a social animal అనే జాతీయం కలదు. తెలుగులో దాన్నే మనము ఒక్క మాటలో 'నరపశువు' అంటాము. నేను ఇక్కడ 'పశు లేక జంతు' అనే పదప్రయోగం చేస్తున్నప్పుడు ఎవ్వరిని విమర్శించడం లేదు. అయితే గాయత్రీ విజ్ఞానం గురించి తెలుసుకోవాలనుకుంటున్నప్పుడు నేను దాని పునాదిజాళ్ళ విషయములను గూర్చి వివరిస్తున్నాను.

మీరు ఆహారం గురించి గనుక ఆలోచిస్తే గాయత్రీని వుపయోగించుకుంటారు. కానీ ఇది తప్పు. అలా అని గాయత్రీని ఆవిధంగా వుపయోగించుకోవద్దు అని నేను చెప్పడంలేదు. గాయత్రీని వుపయోగించుకునే కామనోద్దేశ్యము అది మాత్రమే కాదు.

అలాగే ఇక్కడ మనము ఇంకో విషయమునుకూడ తెలుసుకోవాలి. నిద్ర అనగానే మనము నిద్రపోయాము అనే భ్రమలో వుంటాము. నిద్ర పోవడమే నిద్ర కాదు. జాగరూకతతో నిద్రించడమే అసలైన నిద్ర. మనము అలా కూడ నిద్రించవచ్చు. ఉదా॥ నేను ఫ్రెంచ్ భాషలో ఈ విషయములను చెప్పడం మొదలెడితే మీకు అర్థం కాదు. కనుక చాలామంది నిద్రాస్థితిలోకి జారుకుంటారు. నిద్ర అనగా మీరు ప్రాపంచిక విషయములను అర్థము చేసుకోలేని స్థితిలో వున్నారు అని.మీ మస్తిష్కంలోకి ప్రవేశించిన విషయాన్ని అర్థము చేసుకోలేని స్థితి నిద్ర. ఆహారం సమకూరిన తర్వాత జంతువులు నిద్రాస్థితిలోకి జారుకుంటాయి. అంటే, చుట్టుప్రక్కల జరుగుతున్న విషయములను పట్టించుకోలేని స్థితిలో వుంటాయి. లేదా పట్టించుకోవు. అనగా ఆ విషయముల పట్ల జాగరూకతలో లేవు.

తర్వాతది భయము. మనకు తెలియనిదాన్ని గురించి మనము భయపడతాము. అవునా! అజ్ఞానము అనేది భయమునకు పునాది.

ప్రజోత్పత్తికోసం ప్రకృతిలో జరిగే క్రియయే మైథునము.

ఇలాగ గనుక మన జీవితమును విశ్లేషించుకుంటే .................. పూజ్యగురుదేవులు దీన్నిగురించి మనకు కొన్ని అద్భుత ఉదాహరణలను ఇచ్చారు. వాటిని గమనిద్దాము. అవి 'మీరు అయితే నరకీటక లేదా నరపశు స్థితి'లో వున్నారు లేదా అప్పుడప్పుడు మీరు నరపక్షులుగా కూడ మారుతారు తప్ప మీరు మనుష్యులుగా రూపుదాల్చుటలేదు.' ఆహారం-నిద్ర-భయము-మైథునములను మనము ఎంతవరకు ఉపయోగించుకోవాలో అంతమాత్రమే వుపయోగించుకోనంతవరకు మనము నరపశులు, నరకీటకముల, నరపక్షుల స్థాయిలోనే జీవిస్తాము. దివ్యజ్ఞానమును పొందాలనుకుంటే 20 క్రాంతిధర్మీ పుస్తకములను చదివితీరాల్సిందే. ఎందుకంటే మనిషి నరపశుస్థాయినుండి మనిషిగా, అక్కడినుండి దేవమానవుడిగా ఎదగటానికి కావల్సిన రీతులను, సూత్రాలను పూజ్యగురుదేవులు వాటిలో అందించారు. ఆలోచనాక్రాంతికి అవి దివ్యమైన 20 సువర్ణ సోపానాలు. 'క్రాంతి' అనే పదమే మీరు ఆ పుస్తకములను చదవడం ఆరంభించడం మరియు విషయావగాహనతో

ముగించడము కూడ జరుగుతుంది అని తెలియజేస్తుంది. ఆ పుస్తకములు మనిషి ఆలోచనలలో క్రాంతిని తెస్తాయి అనే అవగాహనతో వాటిని చదివితే ప్రపంచం తప్పక మారుతుంది. మనిషి తన ఆలోచనలను మార్చుకోవటానికి, ప్రపంచమునకు ఉజ్జ్వల భవిష్యత్తు రావటానికి ఈ 20 పుస్తకములు తప్ప మరో మార్గం లేదు. మనిషి ఎప్పుడెప్పుడు అభివృద్ధిని సాధించాడో అది క్రాంతితోనే సంభవమైనది. ఉదా॥ కమ్యూనిస్ట్ విప్లవం, సామ్యవాదము. మనము ఈ విప్లవములగురించి చర్చించినప్పుడు ఒక ప్రజా సమూహం మేము ఈవిధంగా ఆలోచిస్తాము అని నిర్ణయించుకుని, ఆ ఆలోచనలనే ఆచరణలో పెట్టారు అని మనకు అర్థమౌతుంది. కమ్యూనిష్టు -కమ్యూనిష్టుల లాగ ఆలోచిస్తారు. కాంగ్రేస్ నాయకులు - కాంగ్రేస్ రూపొందించుకున్న ఆ ఆలోచనావిధానమునే ఆచరణలో పెడతారు. ఈ అన్ని విద్యాసంబంధ విషయములు మస్తిష్కంలో వచ్చిన ఆలోచనా మార్పుతప్ప మరేమీ కాదు. ఈ మస్తిష్క ఆలోచనావిధానాలలో ఏ శక్తైతే మన శరీరమునకు శక్తినిస్తున్నదో, అది విప్లవము నిస్తుంది. దాన్నే మన ఋషులు 'శివతత్త్వము'గా గుర్తించారు.

ఇప్పటివరకు చెప్పుకున్న విషయములు ః

**1. సంస్కృతి అనేది నాయకుల ఆలోచనావిధానము.**

**నాయకులు సంస్కృతిని రూపొందిస్తారు.**

**2. సంస్కృతిని ఆచరణలో పెట్టే మానవసముదాయ**

**విధానమును సభ్యత అంటాము.**

ప్రజాసమూహం ఒక చక్కని ఆలోచననుగురించి ఊహించలేదు, దాన్ని అభివృద్ధి చెయ్యలేదు, అయితే నాయకుల ద్వారా అందివ్వబడిన సంస్కృతిని క్రియారూపంలో పెడతారు. అది సభ్యత.

3. మానవీయ సామన్య జీవితవిధానము. దాన్నే పూజ్యగురుదేవులు -నరకీటక లేక నరపశు లేదా నరపక్షి స్థాయి అని చెప్పారు. ఇవి ఎవ్వరిని విమర్శించేందుకు చెప్పబడలేదు. వాటి అర్థమును తెలుసుకుంటే మనిషి జీవనస్థాయి మారుతుంది అని గమనించుకోవాలి తప్ప అన్యధా భావించరాదు. ఎక్కువమంది ఆధ్యాత్మికవాదులు సైతము ఈనాడు నరపశుస్థాయిలోనే జీవిస్తున్నారు. అనగా 'ఆహారనిద్రాభయమైథునఞ్చ....ణామ్' స్థితి. మానవులకు-పశువులకు లేక పక్షులకు గల సామ్యము 4 విషయములలో అనగా- ఆహారం, నిద్ర, భయము, మైథునములలో వుంటుంది. అయితే మానవస్థాయినుండి వంచించబడిన భూతప్రేతపిశాచాదులను తిరిగి

మానవీయస్థాయికి చేర్చే చేతనత్వమును ప్రకృతిలో శివతత్త్వముగా ఋషులు గుర్తించారు.

పూజ్యగురుదేవులు చెప్పే మరో అద్భుత విషయము ఏమిటంటే - మానవీయ శరీరము పిండాండము. మనిషి బ్రహ్మాండం నుండి ఏదైతే నేర్చుకోవాలనుకుంటున్నాడో అది మానవీయ శరీరములో జన్మతోపాటే బీజరూపంలో నిక్షిప్తమైవున్నది. కనుక మనిషి -బ్రహ్మాండంలోని ఒక పిండాండము. కాబట్టి ప్రపంచమును మార్చాలనుకుంటే ముందు మనిషి తన ఆలోచనావిధానమును మార్చుకుని తను స్వయంగా మారాలి. 'మనము మారితే యుగం మారుతుంది' అనే నినాదమును గురుదేవులు దీని ఆధారంగానే ఇచ్చారు. ఈనాడు ప్రపంచము ఒక తప్పుదోవలో నడచుచున్నది. దాన్ని సరిచేసి యథాస్థానంలో పెట్టడానికి మనిషి స్వయంగా తను మారడం తప్ప వేరు మార్గం లేదు. మనిషి దైవంగా మారాలి. మానవజీవితము దైవత్వముతో నిండాలి. పూజ్యగురుదేవులు ఏమని చెప్పేవారంటే - మీ శరీరంలోనే దేవత లందరూ విరాజమానమైవున్నారు' అని. దేవాలయములు మీలో వున్న దైవమును ప్రకటీకృతమయ్యేటట్లు చేసే పుణ్యస్థానములు.

ఉదా॥ శివాలయంలోని శివలింగము= మస్తిష్కము. ఈ రెండిటికీ భేదము లేదు. మానవీయ మస్తిష్కం చుట్టుప్రక్కల ఒక ద్రవము ప్రవిస్తూంటుంది. అదే పావనగంగ. దాన్నే ఋషులు మస్తిష్కంలో జరిగే గంగావతరణగా అభివర్ణించారు. మనము శివతత్త్వమును గురించి చదువుకుంటునప్పుడు గంగావతరణ అనేది యుగాలనాడు జరిగిన సంఘటనగా గాక మన మస్తిష్కంలో జరిగే ఒక ప్రక్రియగా గుర్తించాలి. ఇది ప్రతినిత్యము మనిషి మస్తిష్కంలో జరుగుతూనే వుంటుంది.

**శివతత్తమనేది మనిషి తలలోని మొత్తము మస్తిష్క భాగమును సూచిస్తుంది. దీన్ని ఋషులు శివతత్త్వముగా సాక్షాత్కరించుకున్నారు. గాయత్రీమంత్రము ఈ మొత్తము విధానమును 8 అక్షరాల రూపంలో అందించినది. అవి- 'తత్ సవితుః వరేణ్యం'. కనుక తత్సవితుర్వరేణ్యం అనగా మానవీయ మస్తిష్కం పనిచేసే విధానమును సూచిస్తుంది.**

బ్రహ్మాండంలో సూర్యభగవానుడు ఎలా పనిచేస్తాడో దాన్ని విశ్లేషిస్తుంది. మీ శరీరమనే పిండాండంలో మీ మస్తిష్క క్రియాకలాపమును సూచిస్తాయి ఆ 8 అక్షరాలు. కనుక గాయత్రీ జపము చేస్తేన్న సాధకులు గ్రహించవల్సినది ఏమిటంటే శివతత్త్వము అనేది ఎక్కడో బ్రహ్మాండం (హిమాలయములలో

కైలాసం)లోనేకాక, మీ శరీరంలోనే వున్నది అనే విషయమును గ్రహించాలి. చాలామందికి వచ్చే అనుమానమేమిటంటే బాహ్యంగా వున్న విస్తృత దేవతాశక్తి మానవీయ మస్తిష్కంలో ఎలా కుదించబడి వుంటుంది? అని. దీనికి జవాబు ఏమిటంటే - కళాశాలలో ఒక విద్యార్థి ఉపాధ్యాయులు చెప్పే పాఠమును బాహ్యంగానే శ్రవణము చేస్తాడు. కదా! అయితే ఆ విద్యార్థి పరీక్షలలో ఉత్తీర్ణుడయ్యాడు అనేదానికి సాక్ష్యమేమిటంటే ఆ విద్యార్థి ఉపాధ్యాయుడు చెప్పిన ఆ జ్ఞానమును తన మస్తిష్కంలో ధారణ చేశాడు అనేది. ధారణ చేస్తేనేకదా పరీక్షలో ఉత్తీర్ణుడయ్యేది. ఇది అందరికి తెల్సిన విషయమే.

బాహ్యంగా జరిగే ప్రక్రియ శ్రవణము లేక ట్యూషన్. అంతరంగాన జరిగేది ప్రజ్ఞావతరణ లేక ఇన్‌ట్యూషన్. దీన్ని విశ్లేషించటానికే గురుదేవులు 'శిక్ష - విద్య' అనే అద్భుత పుస్తకరాజమును క్రాంతిధర్మీ సాహిత్యరూపంలో అందించారు. ఆ పుస్తకమును ఈ దృష్టికోణంతో చదవాలి. శిక్ష అనేది మనిషి కొంత హద్దువరకే పరిమితమయ్యాడు అని చెబుతుంది. శిక్ష అనునది విద్యాప్రాప్తి మరియు శిక్షించబడటం అనే రెండు అర్థాలను సూచిస్తుంది. విద్యలో లేక శిక్షలో మీకు ఏ శిక్ష లభిస్తున్నది? ఎలా శిక్షించబడుతున్నారు? ఉదా॥ మీరు విద్యుశ్ఛక్తి గురించి పాఠం చదువుకుంటున్నారు. అంటే మీరు

ఆ పాఠం వరకే పరిమితమయ్యారన్నమాట. ఆ సమయంలో మీరు మరో పాఠ్యాంశమును అధ్యయనం చేస్తే మీరు దానిలో ఉత్తీర్ణులు కాలేరు. కనుక శిక్షించబడుతున్నారన్నమాట. గురుదేవులు శిక్ష అనేది తప్పని చెప్పడం లేదు. కానీ కొంతహద్దువరకే వుంటుంది అని స్పష్టీకరిస్తున్నారు. విద్య సకలమును సూచిస్తుంది.

**అఖండమణ్డలాకారం వ్యాప్తం ఏన చరాచరమ్ ।**

**తత్పదమ్ దర్శితమ్ యేనా తస్మై శ్రీగురవేనమః ॥**

మస్తిష్కవిజ్ఞానము నంతా శివాలయంనుండి గ్రహించాలి మనము. కలియుగంలో వున్న మనం శివాలయమునకు వెళ్ళి ఏమి కోరుకుంటున్నాం? ఏమి సాధిస్తున్నాం? మన కోరికలను తీర్చుకుంటున్నాము. అంతేతప్ప మన మస్తిష్కమునుగురించిగాని, అందులో ప్రవహిస్తున్న ద్రవమును గురించిగాని, అక్కడినుండి ప్రసారితమగుచున్న ఇతర విషయములనుగూర్చిగాని ఆలోచించడం లేదు. అసలలా తెలుసుకోవాలని కూడా మనకు తెలియదు. ఇది బహుశోచనీయ విషయము. మస్తిష్కములో ప్రవహిస్తున్న ఆ ద్రవమే నిజమైన గంగ. ఇది ఎవరిలో వుంటుంది? మానవశరీరధారియైన ప్రతివొక్కరిలోనూ వుంటుంది.

**గాయత్రీమంత్రంలోని తత్సవితుర్వరేణ్యం అనేది 8 అక్షరముల సంపుటి ప్రకృతి లేక మానవ మస్తిష్కములో వున్న శివతత్త్వమును ప్రతిపాదిస్తుంది.**

ఎప్పుడైతే మనం శివపరివారంగురించి ఆలోచిస్తామో, సహజంగానే మస్తిష్కంలోని విజ్ఞానముగురించి ఆలోచించాల్సివస్తుంది. మస్తిష్కము - శివతత్త్వమును సూచిస్తే అక్కడున్న మిగతా భాగములు శివపరివారమును సూచిస్తాయి అనేది నిర్ద్వంధము. ఉదా॥ మన మస్తిష్కములో వున్న గణేశుడిని మనము స్పష్టముగా చూడవచ్చు. (రిఫర్ టోనీనేడర్ వెబ్‌సైట్) వైద్యవిద్య నభ్యసిస్తున్న విద్యార్థులు మస్తిష్కములో యీ భాగమును స్పష్టంగా చూడగలరు. మస్తిష్కంలోని మెడుల్లాఅబ్లాంగెటా భాగము మరియు ఇతర భాగములు వినాయకుడి ఆకృతిలో వుంటాయి.

పూజ్యగురుదేవులు ఈ విషయమును చాలా అద్భుతంగా తమ 'శిక్ష మరియు విద్య' అను క్రాంతిధర్మి సాహిత్యంలో వివరించారు. *శిక్షించబడటంనుండి మరలి, విద్యను గ్రహించండి* అని సూచించారు.

మనము అవతారపరంపరను గురించి ఆలోచిస్తే అవతారములు అనేవి మానవరూపుదాల్చి భూమిమీద అవతరిస్తాయి అని అనుకుంటాము. అది నిజముకూడా. ఉదా॥ శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పరశురాముడు. ఆ

అవతారముల రూపురేఖలను గమనిస్తే మనకు ఏమని స్ఫురిస్తుంది? ఏమని అర్థం చేసుకోవచ్చు? పిండాండ-బ్రహ్మాండ సమన్వయ మాధారంగా ఆ అవతారములు మానవ శరీరంలోకూడ అవతరిస్తాయి అని. మానవశరీరంలో గణేశుని అవతరణ సంభవమే. అలాగే శివుడు. ఈ రెండు అవతారములే మిగతా అన్ని అవతారములకు మూలాధారముగ వుంటాయి. దశావతారములు మన శరీరంలోని భాగములే. శరీరమును లోపలికి చూస్తే ఈ విషయమును మనము గమనించవచ్చు.

మత్స్యావతారము అనేది హార్మోన్స్‌కు చెందినది. మనిషి శరీరంలో వున్న హార్మోన్స్‌ను గనుక గమనిస్తే.... మత్స్యావతారము యొక్క ముఖ్య ప్రాతిపదిక ఏమిటంటే విస్తృతం గావించబడటం. వ్యాపనము. శరీరంలో హార్మోన్స్‌కూడ అలానే పెరుగుతాయికదా?

కూర్మావతారము : ఇది మానవశరీరంలో మస్తిష్కంలో వుంటుంది. కూర్మావతారము ఏమి నిరూపిస్తుంది? దేవతలు-రాక్షసులు మధ్యన ఘోరయుద్ధము జరుగుతున్నప్పుడు అది మూలాధారమగును అని. మనిషికి ఎప్పుడైతే ఏ విషయం పట్లనైనా అనుమానం వచ్చినా, అనుమాన నివృత్తి కావాలన్నా అమృతపానం చేయాలి. అది మస్తిష్కంలోని మరో భాగము

సూచిస్తుంది. మన ఆరాధ్యగురుదేవులు దీనిగురించి ఏమని చెబుతారంటే - ఖేచరీముద్రని అభ్యసిస్తే మనిషి అమృతపానం చేయగలడు అని. సనాతన భారతీయ ఋషులు కూడా అమృతపానమునకు దీన్నే ప్రతిపాదించారు.

అవతారములన్నీ మస్తిష్కంలోని లేదా శరీరంలోని భాగములకు సంబంధించినవే.

బ్రెయిన్‌స్టెమ్ - వరాహావతారమును గుర్తుచేస్తుంది. హిరణ్యాక్షుని వలన భూమి సముద్రంలో మునిగిపోతున్నప్పుడు శ్రీమహావిష్ణువు వరాహస్వరూపమును ధరించి భూమిని పైకి తీసుకొచ్చి తిరిగి సౌరకుటుంబంలో స్వస్థానంలో నిలుపుతాడు. హిరణ్యాక్షుడు అనగా అర్థము తెలుసా? మనిషి దృష్టికోణము ధనముమీద కేంద్రీకృతమై ఉన్నది అని సూచిస్తుంది. మనిషి ధనోపార్జనకు మాత్రమే ఈనాడు విద్య నభ్యసిస్తున్నాడు అనే విషయంలో ఎవరికి ఎటువంటి సందేహం వుండదు. కదా! మనిషి చదువును ఎప్పుడైతే ధనోపార్జనా దృష్టికోణముతో చూస్తున్నాడో అప్పుడది హిరణ్యాక్షము అవుతుంది. అక్కడే మనిషి ఆగిపోతాడు. ఈ దృష్టికోణమును సవరించుకోవటానికి ధ్యానము ఏకైక రాజమార్గము. ధ్యానము ఎలా చేయాలి అనేది శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణునిచే ఇలా చెప్పబడినది.

సమం కాయ శిరోగ్రీవం ధారయన్నచలమ్ స్థిరమ్ ।

సంప్రేక్ష్య నాసికాగ్రం త్వం దిశశ్చానవలోకయన్ ॥

**తాత్పర్యము : శరీరము, శిరస్సు, మెడను సమముగా, కదలకుండా నిలిపి స్థిరుడైయుండి తన నాసికాగ్రభాగమున దృష్టిని కేంద్రీకరించి, ఇతర దిక్కులను చూడక సాధన చేయాలి.**

సాధన చేస్తున్నప్పుడు మనిషి శరీరము, మెడ, శిరస్సు మూడుకూడ తిన్నగా, స్థిరంగా వుండాలి. అలా వున్నప్పుడుమాత్రమే నిజమైన ధ్యానస్థితికి చేరుకుంటాడు సాధకుడు. అదే సత్యమైన ధ్యానము. ఆ ధ్యానము ఎక్కడ కొనసాగుతుంది? బ్రెయిన్‌స్టెమ్‌లో.

*రామావతరణయొక్క ముఖ్యోద్దేశ్యము ఏమనగా - ప్రాణంపోయినా ఆడిన మాట తప్పక పోవడం.* అలాగే ఒకసారి రామబాణము అమ్ములపొదినుండి వెలువడినంతనే అది లక్ష్యమును భేదించితీరుతుంది. రామబాణమునకు తిరుగులేదు. ఇదే మన శరీరంలోని మోటార్ మరియు నెర్వస్‌సిస్టమ్‌లో జరిగే ప్రక్రియ. జ్ఞాన మనేది నాడీవ్యవస్థతో సమన్వయం చెంది క్రియారూపం ధరించనంతవరకు ఊరుకోదు. మోటార్ మరియు నెర్వస్‌సిస్టమ్‌నే ఋషులు కర్మేంద్రియములు మరియు జ్ఞానేంద్రియములు అని ప్రతిపాదించారు.

జ్ఞానేంద్రియములతో గ్రహించిన విషయము కర్మేంద్రియములద్వారా ఆచరణరూపు ధరించనప్పుడు వాటిమధ్య సమన్వయము లేదని అర్థము. మరిక అలాంటప్పుడు - 'ప్రాణము పోయినా ఆడిన మాట తప్పను' అనే వ్రతధారణకు విలువే మున్నది? ప్రాణం పోతుంది గనుకే నేను నా ఆలోచనలను లేక వాక్కును ఆచరణలో పెట్టలేకపోతున్నాను అంటే ఇంక రామతత్త్వమునకు అర్థమే లేదు. అప్పుడు మనోవాక్కాయకర్మలకు వ్యతిరేక పథము లభించినట్లేకదా! మానవ శరీరంలోని వెన్నుముక విల్లు, నాడీవ్యవస్థ - త్రాడు. మనిషి శరీరంలో ప్రతి నాడీ ఒక వ్యవస్థాప్రకారం పనిచేస్తూంటుంది తప్ప అన్యంగా ప్రవర్తించదు. అయితే మనిషి శరీరంలో కోటానుకోట్ల నాడు లుంటాయి. అప్పుడు మనకు ఏ నాడి సక్రియంగా వున్నది అన్నది మనకు తెలియదు. సరే అసలు విషయంలోకి వస్తే రామావతారము - వెన్నుముకని వుపయోగించుకోవాలని అని సూచిస్తుంది.

ఇప్పుడు మనము కల్క్యావతారముగురించి తెలుసుకుందాము. మస్తిష్కంలోని ఒకానొక భాగమును కల్క్యావతారము ప్రతిపాదిస్తుంది. మస్తిష్కపు ఎడమభాగంలో పరశురామావతారము గోచరిస్తుంది. సమాజంలో ఎప్పుడెప్పుడు రాజులలో లేదా క్షత్రియులలో సుసంస్కారవంతమైన దివ్యవాతావరణము లేదో, అప్పుడప్పుడు పరశురామావతారము 21 సార్లు

తన ఖడ్గంతో వారిని తెగనఱికెను. అనగా తన జ్ఞానఖడ్గంతో వారి ఆలోచనల్లో దివ్యమైన, శ్రేష్ఠమైన వాతావరణమునకు అనుకూలమైన క్రాంతిని తీసుకొచ్చెను. ఇక్కడ 21 అనే సంఖ్య ఏమని సూచిస్తుందంటే మనిషి శరీరంలోని 5 జ్ఞానేంద్రియములు+5 కర్మేంద్రియములు+5 ప్రాణములు+5 తత్త్వములు+మనస్సు. మానవ శరీరధారి యైన ప్రతివానిలో ఈ దశావతారాలు వుంటాయని పై వివరణనుబట్టి అందరూ అర్థం చేసుకోవచ్చు.

*మన సనాతన సంస్కృతిలో ' దేవాలయములు ' దేవతావిద్యను అందించే కేంద్రములుగా పరిఢవిల్లాయి.* ఈనాడు? అవే దేవాలయములే కోరికలే తీర్చే కేంద్రములుగా వున్నాయి అని అనడంలో అతిశయోక్తి లేదు. గుడి లోపక దేవుడిని వేడుకునే బిక్షగాళ్ళు ఒక రకం, గుడి వెలుపల వచ్చే భక్తులను యాచించే భిక్షగాళ్ళు మరో రకము. ఇద్దరిలో తేడా కేవలము అడుక్కునే స్థాయి, అంతే. కానీ విద్యార్థులు విద్యాలయమునకు వెళ్ళినప్పుడు విద్యను యాచిస్తున్నారా లేదా ధనము చెల్లించి అర్హతాపూర్వకంగా అభ్యసిస్తున్నారా? విద్యను యాచించలేము, అభ్యసించాల్సిందే. కాబట్టి దేవాలయమునకు వెళ్ళి దేవతను అది కావాలి, ఇది కావాలి అని యాచించ కూడదు. మీమీద ఆ దేవత్వమును ఆపాదించుకునే విద్యను అధ్యయనం

చేయాలి. అప్పుడు ఆ వ్యక్తి దేవతగా మారుతాడు. ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్ళిన విద్యార్థి ఎలా ఇంజనీర్‌గా మారుతున్నాడో, దేవాలయమునకు వెళ్ళిన వ్యక్తి ఆ దేవాలయపు దేవతాస్వరూపమును ధారణ చేసే స్థాయికి ఎదగాలి.

పూజ్యగురుదేవులచే ఇవ్వబడిన ఆలోచనా క్రాంతి అనేది ఇదే. గురుదేవులు మనుష్యుల ఆలోచనలను సవరించినది ఇక్కడే. అంతేకాదు *'దేవతలను యాచించకండి. మీరే దేవతలుగా మారండి' అనే సనాతన సంస్కారమును గురుదేవులు తిరిగి ప్రవేశపెట్టారు.* మనిషే -దేవత, కనుక దేవతగా మారటానికి ప్రయత్నించండి అని ప్రపంచానికి గురుదేవులు పిలుపునిచ్చారు. ఈ విద్యను బోధించే మూలకేంద్రము 'దేవసంస్కృతి విశ్వవిద్యాలయము', శాంతికుంజ్, హరిద్వార్. గాయత్రీమాత యొక్క పంచముఖములే ఆ విశ్వవిద్యాలయంలో పంచవిద్యలుగా రూపుదాల్చాయి. విద్యార్థులకు 5 రకాలైన విషయములను బోధిస్తారు ఆ కేంద్రంలో.

పూజ్యగురుదేవులు తమ క్రాంతిధర్మీ సాహిత్యంలో 'శిక్ష మరియు విద్య' అనే విషయమును వివరిస్తూ ఒక పుస్తకమును రచించారు. మీరుగనుక దాన్ని ఆచరణరూపంలోకి తెచ్చినట్లయితే బహులాభాన్వితులౌతారు అనుటలో అతిశయోక్తి లేదు. శిక్షనుండి మరలి విద్య నాశ్రయించినప్పుడు,

అది పూర్తియిన సందర్భంలో సనాతన భారతీయ సంస్కృతి ఆ విద్యార్థిని 'శ్రీ' అనే పదముతో గౌరవించినది. ఎవరైతే విద్యాభ్యాసమును పూర్తిచేశారో వారి నామమునకు ముందు గౌరవసూచకంగా 'శ్రీ' అక్షరమును చేర్చేవారు. అది విద్యాభ్యాస పరిసమాప్తిని సూచిస్తుంది. ఏ వ్యక్తి పేరుముందుర 'శ్రీ' అని చేర్చబడుతుందో అతను శిక్షగాక విద్యనభ్యసించాడు అని అర్థము.

ఒకసారి నేను ఆగష్టు 15 న పూజ్యగురుదేవులను ఒక పనిమీద సందర్శించాను. అప్పుడు మా మధ్య ఒక సంభాషణ చోటుచేసుకున్నది. అది పుట్టినరోజు గురించి. ఆగష్టు 15 న భారతదేశమునకు స్వాతంత్ర్యము లభించింది. ఆగష్టు 15 శ్రీఅరవిందమహర్షి జన్మదినముకూడ. ఆగష్టు 15 న భారతదేశమునకు స్వాతంత్ర్యము లభించింది అంటే దానికి కారణము నేను ఆగష్టు 15 న జన్మించాను, అందువల్ల స్వతంత్రం లభించిందితప్ప లేకపోతే అంత భాగ్యము భారతీయులకి లేదు అన్నాడు. గురుదేవులూ దాన్ని సమర్థించారు.

మీకు మీ పుట్టినరోజు విలువ తెల్సినరోజున, దాని ప్రాముఖ్యతను గ్రహించినరోజున మీరు జీవితంలో చాలా సాధించగలరు. మీరు ఇప్పటి వరకు ఎన్ని జన్మదినములు చేసుకున్నారో ఒక్కసారి గుర్తుచేసుకోండి. వాటి

ప్రాముఖ్యత కేవలము విందులు చేసుకోవడము, స్నేహితులతో గడపడం. అది గుర్తుంటుంది తప్ప, మరేమి గుర్తుండదు మీకు. శ్రీకృష్ణుడు మనందరికి ఎప్పుడు గుర్తొస్తాడు? కృష్ణాష్టమినాడు. శ్రీరాముని ఎప్పుడు స్మరిస్తాము? శ్రీరామనవమినాడు. అవునా! ఆ తర్వాత పరిస్థితి ఏమిటి?

కాబట్టి ఈ పుట్టినరోజులను బాగా వుపయోగించుకునేందుకు- శ్రీఅరవిందులు చెప్పినట్లుగా -'నేను ఆగష్టు 15 న జన్మించాను కాబట్టి భారతదేశమునకు ఆనాడే స్వతంత్ర మొచ్చింది, లేకపోతే ఆ భాగ్యము లేదు'; -ఆవిధంగానే పూజ్యగురుదేవుల జన్మదినమును మనందరం ఘనంగా జరుపుకోవాలి. ఎందుకు గురుదేవుల 'శతాబ్దీసమారోహం జరుపుకోవాలి?' అనే విషయావగాహన కోసం నేను ఈ వివరణ నిచ్చాను.

*శ్రీకృష్ణాష్టమిరోజున మనకు ఎలాగైతే శ్రీకృష్ణుని కార్యక్రమాలు గుర్తుకొస్తున్నాయో; రామనవమినాడు శ్రీరాముని కార్యక్రమాలు స్ఫురణలోకొస్తున్నాయో; అదేవిధంగా గురుదేవుల జన్మశతాబ్దీసమారోహం నాడు ఆయన చేసిన కార్యక్రమాలు మనందరకు గుర్తుకురావాలి. ఆయన చేసిన కార్యక్రమాలలో ముఖ్యమైనది గాయత్రీ మంత్రము మరియు దాని విజ్ఞానమును ప్రపంచంలోని వ్యక్తివ్యక్తికి అందించుట.*

ఆ విషయమును మనం స్మరించుకుంటాము. దీనితోపాటు 'దేవ సంస్కృతియొక్క స్థాపన కూడ జరగాలి'. అఖండజ్యోతియొక్క ప్రప్రథమ సంచికలలో గురుదేవులు ఇలా చెప్పేవారు. 'నేను గాయత్రీని అందరికి అందించినది స్వర్గమును భూమిమీదకు దింపటానికి కాదు; భూమినే స్వర్గంగా మార్చుటకు'.

మనము భూమిని స్వర్గంగా ఎలా మారుస్తాము? నేను గురుదేవుల తరగతులలో పాఠం వింటునప్పుడు చాలాసార్లు నాకన్నా ముందు వచ్చిన కార్యకర్తలు గురుదేవుల గురించి 'ఆయన బుద్ధభగవానుడి ఉత్తరార్ధము' అని అంటూవుండేవారు. బుద్ధుడు -పూర్వార్ధము. అయితే విచిత్రమైన విషయ మేమిటంటే ఆనాడు బుద్ధుడు ఆ దేశకాల పరిస్థితులను సరిచేయటానికి 'యజ్ఞకర్మ'ను నిషేధించాడు. పూర్వార్ధంలో - యజ్ఞకర్మ నిలుపుదల. ఉత్తరార్ధంలో ఏమి జరుగుతున్నది? యజ్ఞము విశ్వవ్యాప్తం గావింపబడు తున్నది. లక్ష్మీదేవి మన హృదయస్థానంలో విరాజమానమై వుంటుంది. బుద్ధుడు -మస్తిష్కంలో ప్రకాశిస్తూ వుంటాడు. దుర్గాదేవి ఎముకలలో నెలవైవుంటుంది. సంపూర్ణ సౌరవ్యవస్థ మీ మస్తిష్కంలో అవతరిస్తుంది. అక్కడినుండి అది క్రిందికి దిగుతున్నప్పుడు ఒకానొక స్థానంలో కల్క్యావతారము వుంటుంది. దాన్ని మీరు గుర్తించగలరా? 27 నక్షత్రాలు,

నవగ్రహములు మానవ మస్తిష్కంలోని అంతర్భాగములు. ఈ విషయములన్నీ కలిపే గాయత్రీమహావిద్యలో బోధింపబడతాయి. అదే నిజమైన గాయత్రీవిద్యలోని ఒక భాగము. గాయత్రీ మనిషికి ఈ జ్ఞానమును ఎలా ప్రసాదిస్తుంది? గాయత్రీమహావిజ్ఞానంలో పూజ్యగురుదేవులచే చెప్పబడినది. దాని జాగ్రత్తగా పట్టుకుని, అర్థము చేసుకోవాలి.

టోనీనేడర్ అనే న్యూరాలజిస్ట్ మానవ శరీరంలో దేవతలు ఎలా వుంటారు? అనేది ప్రయోగాత్మకంగా నిరూపించాడు. ఇది మన భారతీయ ఋషులు అత్యంత పూర్వకాలంలోనే చెప్పిన విషయమే అని మనందరకు తెలుసు. టోనీనేడర్ దగ్గరకు వైద్యం చేయించుకునేందుకు వచ్చినవారు ఆనాడు విశ్వవిఖ్యాత మనీషులు, కళాకారులు, రాజకీయనాయకులు మొదలగువారు. టోనినేడర్ వారి మస్తిష్కములను స్కానింగ్ చేసినప్పుడు, అక్కడక్కడ చిల్లులు కనిపించాయి. అందువల్ల వారి మస్తిష్కములు సరిగా పనిచేయటం లేదు అని చెప్పాడు. ఐన్‌స్టీన్ లాంటి ప్రఖ్యాత శాస్త్రవేత్త తన మస్తిష్కంలో 7% మాత్రమే వుపయోగించుకున్నాడు అని అంటే; సామాన్యుల మైన మన మెంత వుపయోగించుకుంటామో ఆలోచించండి. బహుశ మన బుఱ్ఱలు పనిచేయడం లేదేమో!!

గాయత్రీమహామంత్రంలోని ప్రతి అక్షరము మానవీయ శరీరంలోని 24 నాడీకేంద్రములలో చలనము కలిగిస్తుంది. నాడీకేంద్రములు - నెర్వస్‌ప్లెక్సెస్ కాదు. అవి నాడీకేంద్రంలోని అంతర్భాగములుగా వుంటాయి. వాటిని మన ఆధ్యాత్మిక భాషలో 'షట్చక్రములు' అంటారు. షట్చక్రములకి ధర్మ-అర్థ-కామ-మోక్షములనే నాలుగు దిశలుంటాయి. కాబట్టి 4×6=24. గాయత్రీమంత్రాక్షరములను సాధకుడు వుచ్చరించినప్పుడు, అవి తన శరీరంలోని 24 ముఖ్యస్థానములలో చలనము కలిగిస్తాయి అని తెలిసి ఉచ్చరించినా, తెలియక వుచ్చరించినా అవి తన పనిని తాము చేసుకుంటూ పోతాయి. గాయత్రీ విద్య లేక ఇలా జరుగుతుంది అన్న జ్ఞానము తెలియకుండా వుచ్చరించినా, అవి ఫలితమునిచ్చితీరుతాయి. ఇవ్వకుండా వుండటం అసంభవము. తెల్సి చేస్తే బాగా వుపయోగించుకోగలము, ఫలితమును తక్షణమే పొందేందుకు అవకాశము కలదు. తెలియక చేసినా తదనురూప ఫలితమును పొందితీరుతాము అనటంలో సందేహం లేదు.

ఓం - అని ఉచ్చారణ చేసినప్పుడు శరీరంలో ఏమి జరుగుతుంది? ఒక విద్యార్థి తన విద్యను పూర్తిచేసుకున్నాక కేవలము అతని చదువును సూచించే రెండు లేక మూడు అక్షరాలు మాత్రమే ఆతని పేరు చివర మనకు కనిపిస్తాయి. ఉదా॥ పిహెచ్.డి. ఎన్ని అక్షరాలు? 2 అక్షరాలు. అయితే

పిహెచ్.డి. అనే మాట వినగానే మనకు ఏమని బోధపడుతుంది? ఆ వ్యక్తి చాలా చదువుకున్నాడని, ఎన్నో పరీక్షలు వ్రాసి అందులో ఉత్తర్ణుడయ్యాడని, చివరకు ఆ విద్యలో నైపుణ్యము సాధించాడని మనకు అర్థమౌతుంది, కదా!!

అలాగే గాయత్రీమంత్రంలోని 'ఓం' అనే అక్షరోచ్చారణ చేసినప్పుడు మనము పూర్తిచేయవల్సిన పాఠ్యాంశము గుర్తుకురావాలి.

ఒక వ్యక్తి నేను ఎమ్. ఎ పరీక్షలో ఉత్తీర్ణుడనయ్యాను అంటే అతను అప్పటికే 1వ తరగతి నుండి 10 వరకు, అక్కడినుండి డిగ్రీ పూర్తిచేసి చివరలో ఎమ్.ఎకు చేరుకున్నాడు అని మనకు స్ఫురిస్తుందికదా! అలాగే ఓంకారోచ్చారణ చేసినప్పుడు మనము ఆధ్యాత్మికజగత్తులోని ఏ పాఠ్యాంశమును పూర్తిచేయాలో తెలియాలి. అలాగే మీ శరీరంలోని ఏ భాగము స్పందనకు లోనవుతున్నది అనేది గమనించాలి. విశ్రాంతి భంగిమలో కూర్చుని 'అ............' అని ఉచ్ఛరించినప్పుడు ఆ శబ్దోచ్చారణ ఎక్కడినుండి వస్తున్నదో గ్రహించండి. అదే ఒక స్థిరాసనంలో కూర్చుని ఉచ్చారణ చేస్తే మీకు వెంటనే తెల్సిపోతుంది. అలా తెలియజెప్పే విద్య ఆసనవిద్య. అది తర్వాత తెలుసుకుందాము. ముందు దీన్ని గమనించండి. చాలు. అది గమనించాక, శరీరమును-మెడను-శిరస్సును వంపులేనివిధంగా వుంచి అప్పుడు తిరిగి 'అ....' అని ఉచ్చారణ చేయండి.

సమం కాయ శిరోగ్రీవం ధారయన్నచలమ్ స్థిరమ్ ।

సంప్రేక్ష నాసికాగ్రం త్వం దిశశ్చానవలోకయన్ ॥

గాయత్రీమంత్రమును అర్థము చేసుకునేందుకు ఈ శ్లోకము మూలాధారము. పద్మాసనంలో శరీరము, మెడ, శిరస్సు ఒకే స్థాయిలో వుండేటట్లు కూర్చుని ఆ భంగిమలో శ్వాసను నిదానంగా, లోతుగా పీలుస్తు 'అ......' అని ఉచ్చరించండి. అలా చేసినప్పుడు పొట్ట లోపలికి పోతుంది. గాయత్రీ సాధన అనేది చాలా సులభము, అయితే వివరణ ఇవ్వడం మాత్రమే కష్టము. విజ్ఞానశాస్త్రంలో సూత్రములు విద్యార్థులను గందరగోళంలో పడేస్తాయి. దానితో విద్యార్థులు తమకు విషయం అవగాహనలోకి రాలేదని వాపోతారు. ఉదా॥ ఉప్పు. బయటి దుకాణంలో కొనాలంటే ఉప్పు కావాలి అని ఎవరి నడిగినా ఇస్తారు. ఎందుకంటే ఉప్పు అంటే అందరికి తెలుసు కాబట్టి. ఉప్పు అనకుండా దుకాణదారుడితో మీరు '$Nacl_2$' అని అడిగితే? చాలా తక్కువమంది దుకాణదారులు స్పందిస్తారు. కదా!! చాలామంది గందరగోళంలో పడతారు.

సాధన చేస్తున్నప్పుడు మీరు 'అ...' అనే అక్షరము ఎక్కడినుండి వస్తున్నదో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించండి. సాయంత్రం 6.00

గంటలనుండి 6.15 వరకు వినే నాదసాధనలో మీకు ఇది అవగాహనలో కొస్తుంది. ఆ సాధనను అభ్యసించండి. అందుకే శాంతికుంజ్‌లో వేలాదిమంది భక్తులు, సాధకులు సాయంత్రం 6.00 గంటలకు ఏ పనులలో నిమగ్నమై వున్నా; వారు శంఖనాదాన్ని వినగానే ఆ పనులను నిలిపివేసి ఎక్కడివారక్కడు కూర్చుని నాదసాధనలో పాలుపంచుకుంటారు. ఎందుకంటే సాధనలో నాభి అనేది చాలా ముఖ్యస్థానము. ఇక్కడినుండి 10 నాడులు శరీరం పై భాగానికి వెళ్ళి అవి మనిషి శరీరంలోని జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములను సక్రియము చేస్తాయి.

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే గాయత్రీ సాధన చేసిన తర్వాత మీరు పొందబోయే పట్టా 'ఓం' అనేది. సాధనలో అకారమును ఉచ్చారణ చేసినప్పుడు పొట్టభాగము లోపలికి కుంచించబడుతుంది. అకారమును ఉచ్చరించబోయే ముందు శ్వాసను బాగా ఊపిరితిత్తులనిండా పీల్చుకొని, పొట్టను లోనికి లాగుతూ వుండాలి.

తర్వాత ఉకారోచ్చారణ చేద్దాము. 'ఉ.....' అని ఉచ్చరిస్తున్నప్పుడు ఏమి జరుగుతున్నది? ఇప్పుడు పొట్ట పైకి లేస్తున్న అనుభూతి కలుగుతుంది. మంత్రాన్ని ఉచ్చారణ చేస్తాం, కానీ సరైన విధివిధానమును అనుసరించము.

అక్కడ సమస్య వస్తుంది. అనుభూతి చెందుతూ సాధన చెయ్యాలి. ఈవిధంగా కొద్దికాలంపాటు చేస్తే తర్వాత అప్రయత్నంగా పొట్ట సాధనకు తగినట్లుగా స్పందిస్తువుంటుంది.

'అ...' అని ఉచ్చరించినప్పుడు పొట్ట లోపలికి కుంచించబడినది. అప్పుడు మూలబంధము ఏర్పడుతుంది.

'ఉ.....' అని ఉచ్చరించినప్పుడు పొట్ట పైకి లేచింది. అప్పుడు - ఉడ్యానబంధము ఏర్పడుతుంది.

కనుక ఈ రెండు అక్షరాలను ఉచ్చారణ చేస్తున్నప్పుడు రెండు బంధనములు ఏర్పడతాయి.

అలాగే 'మ్.......' అని అన్నప్పుడు శిరోభాగము మొత్తము స్పందిస్తుంది. ఇక్కడ జాలంధరబంధము ఏర్పడుతుంది.

కాబట్టి 'అ-ఉ-మ్' అని ఉచ్చారణ చేసినప్పుడు 'ఓం' అనే పట్టాను పొందుతాడు సాధకుడు.

మీరు బి.ఎ. చదువుతున్నప్పుడు నేను ఇప్పుడు అక్షరాలను నేర్చుకుంటున్నాను అని చెప్పరుకదా! మీరు కొంత జ్ఞానమును అప్పటికి సంపాదించుకున్నారు. ఇప్పుడు ఇంకా సంపాదిస్తున్నారు. బి.ఎ. పూర్తవగానే

పట్టా చేతికొస్తుంది. బి.ఎ.లో మీరు అనేక విషయములను నేర్చుకుంటారు. అవునుకదా! అలాగే మీరు ఓంకారమును ఉచ్చారణ చేస్తున్నప్పుడు మూడు బంధనములు--------- **1. మూలబంధనము, 2. ఉడ్యానబంధము, 3. జాలంధరబంధము** ఏర్పడతాయి. పూజ్యగురుదేవులు దీన్నే ఖేచరీముద్ర అనేవారు. గాయత్రీమంత్రము గురించి పూర్వం, ఇప్పుడు ఏమి రచించబడివున్నదో దాన్ని ప్రక్కనపెట్టి ఇప్పుడుమాత్రము మీరు గురుదేవులచే అందించబడిన గాయత్రీవిజ్ఞానమును అర్థము చేసుకోండి. మీరు 'ఓం' అని ఉచ్చారణ చేసినప్పుడు మీరు ఏమి అర్థము చేసుకుంటారు? 'నిష్ఠ-శ్రద్ధ-ప్రజ్ఞ'. ఇవి ఓంకారము నుండి లభించే మూడు ఆధారభూతమైన మానసికస్థితులు.

ఈ 3 ఆధారభూతమైన స్థితులు మానవమాత్రుడైన ప్రతివాడికి అవసరము. ఏ మనిషైనా తన జీవితంలో విజయసోపానాలను అధిరోహించటానికి ఈ మూడు సూత్రాలను పాటించితీరాల్సిందే. చేసే పని పట్ల శ్రద్ధ వుండాలి. ఎలా ముందుకు ఎదగాలి అనే దిశానిర్దేశము తెలియాలి. అదే ప్రజ్ఞ. దాన్ని ఆచరణలో పెట్టే విధానము వుండాలి. అది నిష్ఠ. ఈ మూడే గాయత్రీమంత్రంయొక్క 3 చరణములు. 1. తత్సవితుర్వరేణ్యం,

2. భర్గోదేవస్య ధీమహి, 3. ధియో యో నః ప్రచోదయాత్. *గాయత్రీ మంత్రమును ఉచ్చారణ చేసినప్పుడు 'ఓం'కారము ఏమి ప్రసాదిస్తుంది? నిష్ఠ-శ్రద్ధ-ప్రజ్ఞలను సాధకుని అంతరంగంలో అప్రయత్నంగా నింపుతుంది.*

మీరు కళాశాలకు వెళ్ళినప్పుడు ప్రాక్టికల్స్ చేయటానికి తగిన నిష్ఠ, అవి చేస్తే మీరు చాలా లాభములను పొందుతారు అనే జ్ఞానము బోధించబడుతుంది. అది శ్రద్ధ. ఆ దిశవైపు అడుగులు వేసేందుకు ప్రజ్ఞ అవసరము. మీరు చెయ్యవల్సినది ఏమీ లేదు. కేవలము వినాలి. వినడం అంటే ఆచరణలోకి రావాలి అని. మేము ఫలానా మాట విన్నామండి అంటే దానర్థమేమిటి? విన్నదాన్ని ఆచరణలో పెట్టామండి అని. కదా!! నేను చెప్పిన మాటలను విన్నారు, కాని వాటికి క్రియారూపమియ్యలేదు. మరప్పుడు మీరు నా మాటలను విన్నట్లా? విననట్లా? విననట్లే.

అలాగే మీరు ఓంకారమును ఉచ్చారణ చేసినప్పుడు చక్రములలో స్పందన కలుగుతుంది. దాన్నే మరో మాటలో చెప్పాలంటే కుండలినీసాధన అని చెప్పవచ్చు. గురుదేవులు కుండలినీతంత్రము అనే పుస్తకమును రచించారు. ఆయన వాఙ్మయంలో దీనిని చదవండి. ఆ పుస్తకంలో చెప్పినదానినే మీరు ఈ సాధనలో మీకు తెలియకుండానే అభ్యసిస్తున్నారు.

మీరు పద్మాసనంలో కూర్చుని ఓంకారమును ఉచ్చారణ చేస్తున్నప్పుడు పైన చెప్పిన స్థితులను అనుభూతి చెందుతారు. దీనికే గురుదేవులు 'మూడు శరీరముల ధ్యానము' అనే అద్భుత విధానమును అందించారు. ఇప్పుడు మీకు ఈ రెండిటికి మధ్య గల సంబంధము గోచరించినదా? ఆ ధ్యానమును చేస్తున్నప్పుడు మీరు గురుదేవుల వాణిని వింటారు. ఆయన వాక్కులలో వినడము, నా మాటలను వినడంకన్నా మీకు వేరే ఫలితమును కలుగజేస్తుంది.

వీటన్నింటితోపాటు మీరు మరో విషయమును అదనంగా చేర్చుకోవాలి. సూర్య ధ్యానం చేస్తున్నప్పుడు బంగారు కిరణ ప్రసారము మీ శరీరంమీద పడుతున్నట్లు భావించుట. మీరు తెల్లటి కిరణమును భావించకూడదు. బంగారు కిరణములను ధ్యానించాలి. గురుదేవులు శ్రీరామకృష్ణపరమహంగా వున్నప్పుడు కాళీ సాధన చేస్తున్న సమయంలో ఆయన మొత్తము శరీరము బంగారువర్ణంలోకి మారిపోయింది. ఈ సంఘటన మీలో ఎంతమందికి తెలుసు? ఆయన తన చేతికి ధరించిన బంగారు గాజులాంటి ఆభరణము- ఆయన శరీర వర్ణం రెండూ ఒక్కటిగానే చూపరులకు గోచరించాయి. అందుకని రెంటికి తేడా స్పష్టంగా తెలిసేదికాదు. మీరు గనుక దీనిని అభ్యాసంలో పెడితే చాలా చక్కని లాభమేమిటంటే ఒబేసిటి మొదలగునవి తొలగిపోతాయి.

మీరు కేవలము స్వర్ణిమ సూర్యుడిని ధ్యానించినంతమాత్రముననే అనేక లాభములను పొందుతారు. మీరు సూర్యధ్యానం చేస్తే సాధనా పరాకాష్ఠగా బంగారువర్ణంలోకి మారిపోయితీరాలి. ఎందుకంటే బాహ్యంగా కనిపించేది శ్వేతవర్ణము. స్వర్ణిమ వర్ణము ప్రాణశక్తి యొక్క వర్ణము లేక కాంతి. మీరు తెల్లని వర్ణము గురించి ధ్యానిస్తే మీరు వైటాలిటీని పొందుతారనుటలో సందేహం లేదు. దాని లాభాలు దానికున్నాయి. స్వర్ణిమధ్యానం చేస్తే ప్రాణశక్తి మీలోకి ప్రవేశిస్తుంది. అది పంచప్రాణాలలో వుంటుంది. ఒక్క బంగారువర్ణమే మీ శరీరంలోని వివిధ భాగాలలోకి ప్రవేశించినప్పుడు అది అనేకానేక శక్తులుగా ప్రకటీకృతమౌతుంది. ఓంకారమును ఉచ్చారణ చేసినంతనే మీరు పైన చెప్పిన మూడు విధములైన లాభాలను పొందుతారు. అంతేకాదు ఓంకారము గురువులకు-గురువు. ప్రపంచంలో మరిక గురువుగారిలాంటి గురువు పుట్టబోరు. ఆయన గురుస్వరూపులు. గాయత్రీ గురించి ఆయన చెప్పినంతగా మరెవ్వరూ చెప్పలేదు.

తర్వాత భూర్భువః స్వఃలోకి ప్రవేశిద్దాము. భూర్ అనేది భౌతికజగత్తును సూచిస్తుందని అందరూ అర్థము చేసుకోండి. భౌతికజగత్తు అంటే సమస్త భౌతికజగత్తు ఇందులో కలుస్తుంది. ఒక్క భూమే కాదు సమస్త విశ్వంలోని భౌతికజగత్తు అనగా పృథ్వీతత్త్వము గల ఏదైనా అని అర్థము. అది భూర్

తత్త్వము. కనుక మీరెప్పుడైతే భూర్ అనే పదోచ్చారణ చేస్తారో అప్పుడు సెల్‌ఫోన్స్‌లోలాగా ప్రపంచంలోని ఎవ్వరితోనైనా సంబంధమును కలుపుకోగలరు. సెల్‌తో అది సాధ్యమౌతోందిగదా! ఇక్కడ అంతే. మీరు భూర్ అని ఉచ్చారణ చేసినప్పుడు భౌతికవస్తువు దేనితోనైనా సంబంధమును ఏర్పాటు చేసుకోగలరు.

భువః అనేది ప్రాణమయకోశము లేదా కోరికను సూచిస్తుంది.

స్వః మానసికతలము. అనగా కేవలము మనిషియొక్క మనస్సు మాత్రమే అనికాదు. సమస్త ప్రపంచముయొక్క మనోమయతలము అని. ఖనిజ, వృక్ష, జంతుజగత్తులు కూడ ఇందులో కలుస్తాయి. ఖనిజములు మనస్సు లేక బుద్ధిని కలిగివుంటాయా? అని చాలామందికి సందేహము. ఉంటాయి. ఉదా॥ కొన్ని అణువులు ఒకదానితో ఒకటి కలుస్తాయి. కొన్ని కలవవు లేద సంయోగం చెందవు. అందుకే రసాయనశాస్త్రంలో అనేక థియరీలు ప్రతిపాదించబడ్డాయి. కాంబినేషన్ థియరీ, డబుల్ కాంబినేషన్ థియరీ మొదలగునవి అలాంటిదానినే సూచిస్తాయి. ప్రతి అణువు ఒకానొక ప్రజ్ఞను కలిగివుంటుంది. భూర్, భువః,స్వః - వీటినే త్రిలోకములు అని చెబుతారు. త్రిలోకములను తెలుసుకునేందుకు మీరు ఉపయోగించే

యంత్రము ఏమిటి? మీ శరీర మనే యంత్రమునే. దీన్ని సాధించటానికి మీరేమి ప్రత్యేకమైన ప్రయోగాశాలలను నిర్మించనవసరము లేదు. వాటికోసం కోటానుకోట్ల రూపాయలను వెచ్చించాల్సిన పనిలేదు. కేవలము మీ శరీరమనే యంత్రమును వుపయోగించుకుంటే చాలు. అమోఘ ఫలితములను పొందవచ్చు. మీ శరీరములోనే సమస్తము నిక్షిప్తమై వున్నది.

తత్సవితుర్వరేణ్యం - పూజ్యగురుదేవులు ఈ పదమును ఉచ్చరించినప్పుడు శరీరంలోని ఏ భాగములు స్పందనకు లోనౌతాయో చెప్పారు. ఆ స్పందన మీ చేతనత్వ స్థాయిని పెంచుతుంది. తత్సవితుర్వరేణ్యం - అని పలుకుతున్నప్పుడు మీ చేతనత్వంలో ఏ మార్పు సంభవించినది? శివతత్త్వము ప్రచోదన చెందినది. మస్తిష్కము స్పందిస్తుంది. మానవ మస్తిష్కం మొత్తము శివలింగమును సూచిస్తుంది. కనుక తత్సవితుర్వరేణ్యం - అనేది గాయత్రీ యొక్క శాంభవీశక్తి. తత్సవితుర్వరేణ్యం - అని పలుకుతున్నప్పుడు మీ శరీరంలో ఏయే భాగములు స్పందిస్తున్నాయో గమనించుకుంటూ చెయ్యాలి. గాయత్రీ అక్షరన్యాసము బొమ్మను దగ్గర పెట్టుకుని మొదట అభ్యాసం చేస్తే తర్వాత అదే అప్రయత్నంగా స్ఫురణకు వస్తుంది. గాయత్రీ మంత్రమును జపిస్తున్నప్పుడు మీ కేంద్రములలో స్పందనలపట్ల జాగరూకులై వుంటే స్పందన అనుభూతిలోకొస్తుంది.

భర్గోదేవస్య ధీమహి - అనగానే ఏమి జరుగుతుంది? మీకు ప్రజ్ఞ కలుగగానే మీ అజ్ఞానము అంతమౌతుంది. ఈ అక్షరములను ఉచ్చారణ చేస్తే మీ అజ్ఞానము తొలగించబడుతుంది. మీరు ఆహారమును తీసుకున్నారు. అది కాలేయము మొదలగువాటిలో అరిగించబడినది. అక్కడినుండి అది క్రమంగా రక్తంలోకి ప్రవేశిస్తుంది. రక్తంనుండి అది గుండెలోకి ప్రవేశించి, అక్కడ శుద్ధిగావించబడి, తిరిగి శరీరం మొత్తానికి పంపిణీ చేయబడుతుంది. ఆ ప్రక్రియే శరీరమును సంతులనములో వుంచుతుంది. కనుక భర్గోదేవస్య ధీమహి అనేది ఏ శక్తికి సంకేతము? వైష్ణవీశక్తికి. విష్ణువుకి - వైష్ణవీశక్తికి గల తేడాను చూసి గందరగోళంలో పడకండి. అక్కడ లింగభేదము తప్ప మరేమి లేదు. భర్గోదేవస్య ధీమహి అనేది పరిపాలనా శక్తి. భర్గోదేవస్య ధీమహి అని ఉచ్చరించినప్పుడు మీ దృష్టిని ఎక్కడ కేంద్రీకరించాలి? వైష్ణవీశక్తిమీద. తర్వాత ధియో యోనః ప్రచోదయాత్ - క్రియారూపము నిచ్చుట. అదే నిష్ఠ. అదే కాళి లేక సరస్వతీశక్తి. సరస్వతీ అనే శక్తి మీరు కాలమును సంపూర్ణంగా నియంత్రించే జ్ఞానమును ప్రసాదిస్తుంది. కాళి అనేది కాలమును సూచిస్తుంది.

ఇప్పుడు గాయత్రీమంత్రమును ఒక్కసారి పూర్తిగా అవగాహన చేసుకుందాము.

ఓం భూర్భువఃస్వః - అనగా మూడులోకములు. ఒక్క భూమే కాదు. సమస్తము వస్తాయి. అయితే మీరు ఈ మూడు లోకాలతో సంబంధము పెట్టుకుంటే-----ఏమి జరుగుతుంది?

తత్సవితుర్వరేణ్యం -ఇక్కడ సూర్యుని బంగారు కాంతి అవతరణ జరుగుతుంది. ఆ అవతరణ జరిగినప్పుడు హార్మోన్స్ ప్రచోదన చెందుతాయి. అవి రక్తమునకు చెందినది. రక్తము గుండెకు చేరుతుంది. అక్కడి నుండి శరీరము మొత్తమునకు అందుతుంది. గుండెకు చేరగానే ఏమి జరుగుతుంది?

భర్గోదేవస్య ధీమహి - మన అజ్ఞానము తొలగించబడుతుంది. అయితే మీరు మంచిది అని తెలిసినదాన్ని ఆచరణలో పెట్టకపోతే లాభమేమున్నది?

ధియో యోనః ప్రచోదయాత్ - మన ఆచరణలో మార్పు.

ఇదే గాయత్రీమంత్రముయొక్క ఆధారభూతమైన విజ్ఞానము. గాయత్రీమంత్రము మీ భౌతికశరీరముతో సూటిగా సంబంధమును కలిగియున్నది. భౌతికశరీరము బ్రహ్మాండము యొక్క భౌతిక అభివ్యక్తి. అయితే మనము బ్రహ్మాండము పట్ల స్పృహను కలిగియుండనందువల్ల, మనము కేవలము ఆహారనిద్రాభయమైథునఇచ్ఛలోనే ఆసక్తిని కలిగి యున్నందు వల్ల గాయత్రీతో అనుకున్న లాభాలను పొందలేకపోతున్నాము.

ఉద్యోగములను కేవలము ఆహారోపార్జనకుమాత్రమే చేస్తున్నాము. కానీ గాయత్రీమంత్రముతో మీరు ఏమి సాధించాలి? మీరు సమస్త ప్రపంచముతోను సంబంధమును నెరపగలస్థాయికి ఎదగగలరు. ఆ స్థితిలో మీరు విశ్వమాత లాగ ప్రవర్తిస్తారు. ప్రపంచమునకు జననిగా వ్యవహరిస్తారు. కాబట్టి వేదమాత జ్ఞానముతో దేవమాత స్థితికి ఎదురుతారు. వేదమాత అనగా జ్ఞానముపట్ల ఎఱుక. దేవమాత అనగానే ప్రాణశక్తి సాధకునిలోకి దిగుతుంది. దేవాలయమునకు వెళ్ళినప్పుడు మీరు దేవతలను యాచించకండి. మీరే ఆ దేవతగా మారండి. అలా దేవతలుగా మారినవారినే మనము సిద్ధపురుషులు అని పిలుస్తాము.

శ్రీరామకృష్ణపరమహంస కాళికామాతను ప్రార్థిస్తున్నప్పుడు, ఆ కాళికాలయ కార్యనిర్వహణాధికారి యైన మధురాబాబు ఆ సమయములో అక్కడికొచ్చాడు. శ్రీరామకృష్ణగురుదేవులు అటుఇటు పచార్లు చేస్తున్నారు. అప్పుడు మధురాబాబుకి ఒక దివ్యదర్శనమైనది. గురుదేవులు ఒకవైపు నడచినప్పుడు శ్రీరామకృష్ణపరమహంసగా కనిపిస్తే, మరోవైపు కాళీమాతగా దర్శనమిచ్చారు.

మానవ శరీరంలోని షట్చక్రములలో గాయత్రీమంత్రాక్షరాలను దర్శిస్తాము. తత్, స, వి, తుర్, వ, రే, ణ్యం, భ, ర్గో, దే, వ, స్య అనేవి ఆ చక్రములలోనే దర్శనమిస్తాయి. సంస్కృతభాషలోని శబ్దములు ఇక్కడినుండే ఉత్పత్తౌతాయి. మనము గాయత్రీమంత్రోచ్చారణ చేయటానికి ప్రయత్నిస్తున్నప్పుడు, 5 కర్మేంద్రియములు, 5 జ్ఞానేంద్రియముల మీద సాధికారతను పొందటానికి ప్రయత్నిస్తున్నప్పుడు సాధనలో ప్రతిదినము మనము ఎంత అభివృద్ధి సాధించాము, ఇంద్రియాలమీద ఎంత ఆధిపత్యమును వహించాము అన్నది గమనించుకోవాలి.

విద్యార్థి కళాశాలకు ప్రతిదినము వెళతాడు. కదా!! అక్కడ కొంత సమయమును గడిపి, తిరిగి వెనక్కొస్తాడు. అతను నిత్యము పాఠ్యాంశములో కొంత భాగమును గ్రహిస్తాడు. ఇలా చేస్తున్నాడు కాబట్టి అతను ఆహారం స్వీకరించడంలేదని, నిద్ర పోవడం లేదని, టి.వి. చూడటం లేదని కాదుగా? అతను అన్ని పనులను చేస్తాడు, చేస్తూనే జ్ఞానమును ఆర్జిస్తాడు. అలాగే మీరు సాధన చేస్తున్నప్పుడు 5 జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలు, 5 ప్రాణాలు, 5 తత్త్వములు, అలాగే మనోబుద్ధ్యాహంకారములు, అన్నింటిని కలుపుకుంటే 24 తత్త్వములు అవుతాయి. గాయత్రీ మంత్రంలోని 24 సంఖ్య

వీటినే సంకేతిస్తుంది. కనుక గాయత్రీమంత్రము సాధకుని సర్వజ్ఞత్వమును ప్రసాదిస్తుంది. ఆ శక్తినే విశ్వమాతగాయత్రీ అంటారు.

మనము ఏ లోకమును గురించి మాట్లాడుకున్నా అవి షట్చక్రములతో నియంత్రించబడతాయి. ఉదా॥ స్వాధిష్ఠానచక్రమునే తీసుకుంటే అక్కడినుండి -'బభమయరల' అనే శబ్దములు వెలువడతాయి. బీజాక్షరము నాదముగా బహిర్గతమౌతుంది అని చెప్తున్నాను. నేను శబ్దముల గురించి చెప్పడం లేదు, నాదమును గురించి వివరిస్తున్నాను. స్వాధిష్ఠాన చక్రముయొక్క బీజాక్షరము 'వం'. వం అనే బీజాక్షరము కనుక మేలుకొంటే మీరు -బభమయరల- అనే అక్షరాలను అనాయాసంగా ఉచ్చారణ చేయగలరు.

ఇప్పుడు భయము గురించి చెప్పుకుందాము. పూజ్యగురుదేవులు ఏమనేవారంటే; ఒక్కసారిగనుక మీరు గాయత్రీమంత్రంలో ప్రవీణులైతే మీరు ఏది అంటే అది జరుగుతుంది. ఎందుకంటే స్వాధిష్ఠానచక్ర జాగరణ జరిగింది కాబట్టి. సిద్ధపురుషులు, గురుదేవులు మొదలగువారు ఏది అంటే అది జరగటానికి కారణము వారి స్వాధిష్ఠానచక్రము మేలుకున్నదికాబట్టి. మనకి? మనము అన్నదితప్ప మిగతాదంతా జరుగుతుంది. కదా!! దీనికి కారణము ఏమిటంటే మన స్వాధిష్ఠానచక్ర జాగరణ జరుగలేదుగనుక.

అందుచేత మీరు కనుక గాయత్రీ జపము చెయ్యడము ఆరంభిస్తే షట్చక్రములు, 24 స్థానములు, 24 తత్త్వములు క్రియాన్వితమౌతాయి. మరియే ఇతర జ్ఞానమైనా దీన్ని అధిగమించగలదు అని మీరు భావిస్తున్నారా!! ఆధునిక కాలానికి చెందిన ఏ జ్ఞానమైనా దీన్నిమించి పోగలదనే మీరు అనుకుంటున్నారా? కాబట్టి గాయత్రీమంత్రము ఈనాడు దేవమానవులను ఉత్పన్నము చేస్తున్నది. చెయ్యబోతున్నదికూడ. దేవమానములు అంటే తమ శరీరంలో వున్న శక్తికేంద్రముల గురించి తెలుసుకుని, ఆ శక్తిని వుపయోగించుకోగల సామర్థ్యము గలవారు. గాయత్రీమంత్రము షట్చక్రములను ఎలా కుదిపి లేపుతున్నది? శక్తికేంద్రములు ఎలా జాగరణ చెందుతున్నాయి? ఈ జ్ఞానమంతా దేవమానవులకు తెలుస్తుంది. గాయత్రీమంత్రము సాధకుని శరీరంలోని 5 జ్ఞానేంద్రియాలను, 5 కర్మేంద్రియాలను, 5 ప్రాణాలను, 5 తత్త్వములను, మనోబుద్ధిచిత్తాహంకారములను జాగృతము చేస్తుంది.

ఈనాడు మనకు నిజంగా గాయత్రీమంత్రార్థము తెలియదు. ఆ గాయత్రీ గురించే నేను మీకు కొంత వివరించాను. పూజ్యగురుదేవులు గాయత్రీమంత్రమును ప్రపంచమునకు అందించి ఏమి సాధించదలచుకున్నారో అర్థము చేసుకోండి. గాయత్రీని కేవలము మంత్రంగానే చూడకండి.

దానిద్వారా గురుదేవులు విశ్వములోని సమస్త జ్ఞానమును మీకు అందివ్వాలనుకుంటున్నారు. భూతభవిష్యవర్తమానకాలములకు చెందిన జ్ఞానము ఇప్పటికే 'దేవసంస్కృతి విశ్వవిద్యాలయము'లో ఇప్పటికే బోధింపబడుతున్నది. మీరు ఆ జ్ఞానమును పొందటానికి సర్వవిధాలా ప్రయత్నించండి. డిగ్రీ సంగతి తర్వాత ఆలోచిద్దాము. ఆ జ్ఞానమును అధ్యయనం చేయండి. ఆ జ్ఞానము పొందిన తర్వాత మీకు అనేక పదముల యొక్క నిజమైన అర్థము స్ఫురిస్తుంది. గాయత్రీని జపించండి. పూజ్య గురుదేవుల, వందనీయ మాతాజీ ఆశీస్సులు గాయత్రీమాత ఆశీస్సులతోపాటు లభించితీరుతాయి. అలాగే కీర్తి, యశస్సు కూడ లభించింది. మీరు చాలా లాభములను పొందుతారుతప్ప కోల్పోయేది ఏమీ లేదు. అయితే గాయత్రీని సామూహికంగా పైకి ఉచ్చరించాలని గురుదేవులు ఆదేశించారు. ఎందుకనగా భావనతో మాత్రమే చేస్తే చాలదు. శబ్దములు వాతావరణంలో వ్యాపించాలంటే అవి బిగ్గరగా వుచ్చరించబడాలి.

శుభం భూయాత్